

బాలిక చదువే భవితకు వెలుగు

చిత్తూరు కలెక్టరేట్ : పేద, అనాథ పిల్లలతోపాటు బడిబయట పిల్లలకు నాణ్యమైన విద్యను అందిం చేందుకు ప్రభుత్వం కేజీబీవీ పాఠశాలలను నెలకొల్పింది. – 8లో



శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: ఆలయంలోని శనీశ్వరస్వామికి శని వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివా రికి ముందుగా కలశ పూజలు, అనంతరం తైలా భిషేకం చేసి, భక్తులకు దర్శనం కల్పించారు.

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	36	22
తిరుపతి	36	22
తిరుమల	32	18
గూడూరు	36	24
నగరి	37	24

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం(సా)	సహర్ సోమవారం(ఉ)
తిరుపతి	6.28	4.43
చిత్తూరు	6.30	4.43
పుంగనూరు	6.32	4.47

న్యూస్‌రీల్

'ప్రసవ వేదన'పై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం జిల్లా ఆస్పత్రిలోని ప్రసూతి విభాగంపై 'సాక్షి' దిన పత్రికలో ఇటీవల ప్రసవ వేదన పేరిట వార్తకథనం ప్రచురితమైంది. దీనిపై ఆస్పత్రి అధికారులు విచారణకు ఆదేశించారు. మూడు రోజులపాటు విచారణ కొనసాగించారు. తెల్లకాగితంపై గర్భిణి కుటుంబీకుల వద్ద సంతకం ఎందుకు తీసుకున్నారంటూ అధికారులు సిబ్బందిపై ప్రశ్నల వర్షం కురిపించారు. రెఫర్ చేసే విధివిధానాలపై సూచనలు ఇచ్చారు. కాసుల వసూళ్లపై మండిపడ్డారు. ఆ విభాగం వద్ద పనిచేస్తున్న వారిని వేరే విభాగానికి మార్పు చేయాలని సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ ఆదేశించారు.

నేడు బీసీ సదస్సు

చిత్తూరు కలెక్టరేట్ : బీసీ హక్కుల సాధనకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో ఆదివారం సదస్సు నిర్వహించనున్నారు. బీసీ ఐక్య సంఘర్షణ సమితి ఆహ్వాన కమిటీ అధ్యక్షులు పూసల రవి శనివారం విలేకరులతో మాట్లాడుతూ బీసీ హక్కుల సాధన కోసం సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు అంబేడ్కర్ భవనంలో నిర్వహించే సదస్సుకు బీసీలు హాజరవుతారని చెప్పారు. ఈ సదస్సులో పలు హక్కుల డిమాండ్లపై చర్చలు జరిపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని ఆయన వెల్లడించారు.

అనారోగ్య సమస్యలుంటే తెలియజేయండి



మాట్లాడుతున్న డీఈవో విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : పదవ తరగతి మూల్యాంకన ఉత్తర్వులు ఇవ్వక ముందే అనారోగ్య సమస్యలున్నవారు తెలియజేయాలని డీఈవో విజయేంద్రరావు అన్నారు. స్థానిక డీఈవో కార్యాలయంలో శనివారం పలు ఉపాధ్యాయ సంఘ నేతలతో సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు పదవ తరగతి మూల్యాంకనం ప్రారంభమవుతుందన్నారు. మూల్యాంకన ప్రక్రియకు పకడ్బందీగా కసరత్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీచర్లకు ఏవైనా అనారోగ్య సమస్యలున్నట్‌లైతే చికిత్స చేయికుంటున్న ఆధారాలతో వినతిపత్రం పెట్టుకోవాలన్నారు. ఉత్తర్వులు పంపించాక రద్దు చేయడం కుదరదని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి పదవ తరగతి జవాబుపత్రాల డీకోడింగ్ మొదలైందని వెల్లడించారు. ఈ సమావేశంలో డీవైఈవో చంద్రశేఖర్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామిరెడ్డి, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్పీ బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లా అడిషనల్ ఎస్పీ జగదీష్‌ను బదిలీ చేస్తూ శనివారం పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లా 14 బెటాలియన్‌కు ఆయన్ను బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

స్విమ్స్‌లో కోర్సులకు ప్రవేశాలు

తిరుపతి తుడా: స్విమ్స్ వర్సిటీలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ కోర్సుల్లో ప్రవేశాలను ఏపీ పీజీ సెట్ ద్వారా చేపట్టనున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు www.cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కొబ్బరి.. లాభాలే మరి!

జిల్లాలో కొబ్బరి పంట సిరులు కురిపిస్తోంది.. దీంతో సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. దశాబ్దాల తరబడి లక్షలాది మందికి ప్రత్యక్షంగా.. పరోక్షంగా జీవనాధారం కల్పిస్తోంది.. విలువ ఆధారిత ఉత్పత్తులతో కాసుల పంట పండిస్తోంది.. టెంకాయ సాగుకు జిల్లా ఉద్యానశాఖ పూర్తిగా సహకరిస్తోంది.. సకాలంలో భూసార పరీక్షలు చేయిస్తూ రైతులు మంచి దిగుబడి పొందేలా సలహాలు అందిస్తోంది.. వేసవి నేపథ్యంలో కొబ్బరి బోండాలకు గిరాకీ పెరుగుతోంది.. పరిమాణం మేరకు చక్కటి ధర గిట్టుబాటు అవుతోంది.



చిత్తూరు మండలం అనంతాపురంగ్రామం వద్ద సాగులో ఉన్న కొబ్బరితోట

- టెంకాయ సాగుపై మొగ్గుతున్న రైతులు
- పలు రకాల ఉత్పత్తులతో మంచి ఆదాయం
- జిల్లావ్యాప్తంగా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- వేసవి నేపథ్యంలో నారికేళ నీటికి అధిక డిమాండ్

చిత్తూరు రూరల్ : ఆరోగ్యప్రదాయినిగా నారికేళం ప్రసిద్ధి చెందింది. దాహార్తిని తీర్చే కమ్మని జలం అందిస్తూ ప్రజల మనసుదోచుకుంటోంది. శుభకార్యాలకు ప్రతి ఇంటా కొబ్బరికాయ ఉండాల్సిందే. పెరుగుతున్న వినియోగం ప్రకారం జిల్లాలో ఏటా టెంకాయ సాగు గణనీయంగా విస్తరిస్తోంది.

25వేల మంది రైతులకు జీవనాధారం

జిల్లాలో ఒకప్పుడు కరువు కాటకాలతో కొబ్బరి సాగు మందగించింది. నీటి వసతి లేని కారణంగా చాలామంది రైతులు టెంకాయ తోటలను నిలువనా వదిలేశారు. గత మూడేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో కొబ్బరి చెట్లు పచ్చగా కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 1,500 ఎకరాల్లో కొబ్బరి సాగులో ఉంది. కొత్తగా మరో 500 ఎకరాల్లో పంట సాగులోకి వస్తోంది. సుమారు 25 వేల మంది రైతులు ఈ పంటను ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు.



చిత్తూరు మండలం తెల్లగుండ్ల వలస వద్ద సాగులోకి తెస్తున్న కొబ్బరి పంట

శ్రమ తక్కువ.. ఆదాయం ఎక్కువ

కొబ్బరి చెట్లలో పొడవు, పొట్టి రకాలు ఉన్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న నర్సరీల్లో టెంకాయ మొక్కలను సిద్ధం చేస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని రైతులు తమిళనాడులోని నర్సరీల నుంచి మొక్కలను తెచ్చుకుంటున్నారు. ఒక మొక్క రూ.50 నుంచి రూ.1000ల వరకు లభిస్తోంది. కాయ నాణ్యతను అనుసరించి మొక్కలు ధర పలుకుతున్నాయి. కొందరు పెద్ద సైజు ఉన్న కాయలను తెచ్చి నారుపోసుకుంటున్నారు. ఇవి నాటుకొచ్చాక ఉద్యాన శాఖ అధికారుల సూచనల మేరకు నాటుకుంటున్నారు. ఎకరాకు 60 నుంచి 100 మొక్కల వరకు పెడుతున్నారు. మూడేళ్ల తర్వాత పంట కోతకు వస్తోంది. ఆపై ఏడాదికి రెండు సార్లు దిగుబడి వస్తోంది. ఎకరాలో ఒక కోతకు రూ. 60 వేల నుంచి రూ. లక్ష వరకు ఆదాయం వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులు

ఎండిన కొబ్బరి చిప్పను రూ. 25 నుంచి రూ. 50లకు విక్రయిస్తున్నారు చేస్తున్నారు. అలాగే కొబ్బరి నూనె తయారీకి కూడా వినియోగిస్తున్నారు. లీటర్ నూనె రూ.80 వరకు అమ్ముకుంటున్నారు. ఎండిన మట్టలు సైతం రైతులకు కాసులు కురిపిస్తున్నాయి. ఈ మట్టలతో అల్లికలు, ఆకులను తొలగించి ఈనెలు సేకరించి చీపురు కట్టలు తయారు చేసి మార్కెట్లోకి తీసుకువస్తున్నారు. స్థానికంగా అమ్మితే రూ. 20, నగరాల్లో అయితే రూ. 30 వరకు ధర పలుకుతోంది. కొబ్బరి పీచు, పొట్టుతో వివిధ వస్తువులను తయారు చేస్తున్నారు. ఇలా పలు రూపాల్లో టెంకాయ సాగు చేసిన రైతులు లాభాలు గడిస్తున్నారు.

చక్కటి ఆదాయం



ఐదేళ్ల కిందట కొబ్బరి మొక్కలు నాటాం. చెట్లు ఏపుగా పెరిగాయి. ఐదు ఎకరాల్లో పంట దిగుబడి వస్తోంది. చక్కటి ఆదాయం లభిస్తోంది. గతంలో కూరగాయలు, వేరుశనగ, వరి తదితర పంటలను సాగు చేసేవాళ్లం. వాటితో పోలిస్తే టెంకాయ సాగులో శ్రమ తక్కువ.

– మంజుల, రైతు, చిత్తూరు

సలహాలు పాటించాలి



కొబ్బరి పంట అన్ని రకాలుగా రైతులకు ఆదాయం సమకూరుస్తోంది. నీటి వసతి ఉంటే చాలు సాగు సులభంగా ఉంటుంది. రైతులు ఇష్టారీతిన మొక్కలు నాటుకోకూడదు. భూసార పరీక్షలు చేయించుకుని, ఉద్యానశాఖ అధికారుల సూచనల మేరకు నాటుకోవాలి. తగు జాగ్రత్తలతో కొబ్బరి సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుంది.

– హరికృష్ణారెడ్డి, ఉద్యానశాఖ అధికారి, చిత్తూరు

పెరిగిన విక్రయాలు

కొబ్బరి నీళ్లు తాగే వాళ్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. ఒక కొబ్బరి బోండా సైజును బట్టి రూ. 20 నుంచి రూ.60ల వరకు విక్రయిస్తున్నారు. ఈ వ్యాపారంలో చాలామంది బతుకు తెరువు చూసుకుంటున్నారు. కల్లుగీత కార్మికులకు కూడా కొబ్బరి కల్లు రూపంలో జీవనోపాధి దొరుకుతోంది. అలాగే రైతులకు సైతం అదనపు ఆదాయం లభిస్తోంది. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మొలకొచ్చిన కొబ్బరిని రూ.50 నుంచి రూ.80 వరకు అమ్ముతుండడం విశేషం.

తహసీల్దార్లకు స్థానచలనం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పనిచేస్తున్న పలువురు తహసీల్దార్లకు స్థానచలనం కల్పిస్తూ, కలెక్టర్ హరి నారాయణన్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని శాంతిపురం తహసీల్దార్ లోకేష్‌రావును కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. అక్కడే డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న కొలేష్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. కుప్పం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల డీటీగా పనిచేస్తున్న బాలాజీని వి.కోట డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. శాంతిపురం డిప్యూటీ తహసీల్దార్ ఫజుల్లాను కలెక్టరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. పెనుమూరు తహసీల్దార్ సురేశ్‌బాబును వి.కోటకు బదిలీ చేశారు. బదిలీ చెందిన వారు వెంటనే కొత్త స్థానాల్లో చేరాలని, లేనిపక్షంలో శాకాపరమైన చర్యలుంటాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇంగ్లిష్ పరీక్షకు 159 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన పదవ తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 159 మంది గైర్హాజరయ్యాని డీఈవో విజయేంద్రరావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ 21,553 మంది విద్యార్థులకు గాను 21,394 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. 51 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు డీఈవో వివరించారు.

11 నుంచి వసంతోత్సవాలు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి వారి ఆలయంలో ఈ నెల 11వ తేదీ మంగళవారం నుంచి వసంతోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ 11, 12, 13 తేదీల్లో మూడు రోజులపాటు స్వామివారికి వసంతోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మూడు రోజుల్లోనూ ఉదయం సుప్రభాత సేవ, మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, సాయంత్రం స్వామివారు తిరుచ్చి వాహనంపై వేణుగోపాలస్వామివారు, కోదండరామ స్వామివారు ఊరేగుతారని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వసంతోత్సవాలను విజయవంతం చేయాలని చెప్పారు.

కిక్కిరిసిన కాణిపాకం ఆలయం



కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. వరుస సెలవులు కావడంతో శనివారం ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు తరలి వచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు తగు చర్యలు తీసుకొని భక్తులకు దర్శనం కల్పించారు. ఆస్థాన మండపంలో కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. శనివారం ధర్మపథం కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన కళాకారులు కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శించారు.

శ్రీకాళహస్తిలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పకడ్బందీగా ఏర్పాట్లు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయించారు. ఈ క్రమంలో రాహుకేతు సర్పదోష నివారణ పూజలు అధికంగా జరిగినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



నగరంలోని సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



కల్యాణోత్సవంలో సీతారాములవారు



పట్టువస్త్రాల సమర్పణలో కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు రూరల్: పచ్చటి పందిళ్లు... మామిడి తోరణాలు.. వేద పండితుల మంత్రోచ్చారణలు...మంగళ వాయిద్యాల హోరు..భక్తుల నామస్మరణ మధ్య శ్రీ కోదండరామస్వామి కల్యాణం శనివారం కనుల పండువగా సాగింది. చిత్తూరు నగరంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు వేడుకగా నిర్వహించారు. అంతకు ముందుగా స్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామికి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్ర సమర్పణ చేశారు. డప్పువాయిద్యాలు, మంగళ వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామి వారి పట్టువస్త్రాల కార్యక్రమం ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంది. కలెక్టర్ హరినారాయణన్ పట్టువస్త్రాలు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. తదనంతరం ప్రత్యేకంగా అలంకరించిన సీతారాముల వారిని కల్యాణ వేదికపైకి తీసుకొచ్చారు. వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఆ ఘటాన్ని భక్తులకు వివరిస్తూ..ఉత్సవాన్ని పూర్తి చేశారు. దీంతో ఆ వేదిక శ్రీరామ నామస్మరణలతో మారుమోగింది. వచ్చిన భక్తులకు అమ్మవారి ప్రసాదం పంపిణీ చేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సకల వెంకటేష్ గుప్తా, అర్చకులు వేణుగోపాల్, సభ్యులు రాజా, సతీష్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనసున... సంక్షేమ స్పందన



అభిప్రాయ సేకరణలో భాగంగా మహిళతో మాట్లాడుతున్న మంత్రి ఆర్కేరోజా

- ప్రజలకు ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయం
- పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కేరోజా

విజయపురం (నగరి): ప్రజల మనసున సంక్షేమ స్పందన వినిపిస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. విజయపురం మండలం, కోసల నగరం ఎస్టీకాలనీలో శనివారం 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు సచివాలయ కార్యదర్శులు, గృహసారథులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై వారి స్పందనను తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమని అందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రి చెప్పారు. జన్మభూమి కమిటీ కనికరిస్తేనే పథకం అందే అగత్యం నేడు తప్పిందని స్పష్టం చేశారు. వీధి బడి విధిరాత ఇంతేలే అన్న అభిప్రాయం సమూలంగా మారి పాఠశాలలు కార్పొరేట్ స్థాయికి మారాయని, సర్కారు స్కూలు విద్యార్థి బూట్లు, బ్యాగు పట్టుకొని ఇంగ్లీషు చదువులు చదువుతున్నారని చెప్పారు. రేషన్ కార్డు కావాలంటే ఏళ్లకు ఏళ్లు ఎదురుచూడాల్సిన దుస్థితి ఇప్పుడు లేదన్నారు. సిఫారసు లేకుండా సంక్షేమం అందుతోందని, లైనులో నిలబడకుండా విత్తనాలు, ఎరువులు రైతు చెంతకు వస్తున్నాయని చెప్పారు. యువతకు సొంత జిల్లాలో సచివాలయ ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఇవన్నీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయడం కారణంగా వచ్చిన మార్పులన్నారు. జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ అన్న ప్రజల మాటకు గొంతు కలిపారు. ఎంపీపీ జమున, వైస్ ఎంపీపీలు బాలాజీ, దశరథరాజు, ఎంపీడీవో సతీష్ తహసీల్దారు వెంకటరాయలు, ఆర్బీకే చైర్మన్ గుణశేఖర్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు రాజేంద్రన్, డాక్టర్ సోమశేఖర్, సింగిల్‌విండో అధ్యక్షులు హరినాయుడు, నాయకులు శేఖర్‌రాజు, శివరాజు, కుమార్, ప్రసన్న, మురళిరెడ్డి, రత్నం, నారపరాజు, సతీష్, శరత్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సంక్షేమం వివరిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ

మండలంలోని కోసలనగరం గ్రామంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి ఆర్కే రోజా నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల పెంపకందారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఓ మేక పిల్లను చంకలో పెట్టుకుని మురిసిపోయారు.



గొర్రెల పెంపకందారులతో మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా

క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన నిందితుడు, మద్యం, కారు

కుప్పం: మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యాన్ని పెద్దబంగారునత్తం గ్రామం వద్ద పట్టుకున్నట్లు సెబ్ సీఐ కిషోర్ కుమార్ తెలిపారు. స్కార్పియోలో కర్ణాటక మద్యం రవాణా అవుతున్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం అర్ధరాత్రి కాపుగాసి పట్టుకున్నారు. వాహనంలో ఉన్న అమర్, స్టాలిన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే చాకచక్యంగా స్టాలిన్ పరారైనట్లు తెలిపారు. స్కార్పియో వాహనంతోపాటు,అందులోని 3,792 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి, పట్టుబడిన నిందితుడు అమర్‌ను రిమాండుకు పంపించారు. పరారీలో ఉన్నా స్టాలిన్ కోసం గాలింపు చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

మరో కేసులో మహిళ అరెస్టు



మహిళను అరెస్ట్ చూపుతున్న అధికారులు

పలమనేరు: కర్ణాటకలోని తిమ్మరాజుహళ్లి నుంచి కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మహిళను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు, వెంగంవారిపల్లెకు చెందిన నీలమ్మ(61) శనివారం కర్ణాటక మద్యం తరలిస్తుండగా, బైరెడ్డిపల్లె మండలం కడపనత్తం రోడ్డు వద్ద సెబ్ డీటీఎఫ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఆమె వద్దనున్న 49 టెట్రాప్యాకెట్లను సీజ్ చేశారు.

బాలిక చదువే భవితకు వెలుగు

పేద, అనాథ పిల్లలతోపాటు బడిబయట పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ) పాఠశాలలను నెలకొల్పింది. పేద, అనాథలతోపాటు బడి బయట ఉన్న బాలికలకు కస్తూర్బా విద్యాలయాలు వరంగా మారాయి. ఉన్నత విద్యాప్రమాణాలు, ఆహ్లాదకర వాతావరణం, ఆంగ్ల మాధ్యమంలో బోధన.. ఇలా ఎన్నో సౌకర్యాలతో కార్పొరేట్ విద్యాసంస్థలను తలపించే ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు ఏటా పోటీ పెరుగుతోంది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది.

- కేజీబీవీ పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం
- అనాథ, పేద బాలికలకు కేజీబీవీలు వరం
- ఉచిత విద్యతోపాటు వసతి సౌకర్యం
- 20వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం



శాంతిపురం కేజీబీవీలో చదువుతున్న విద్యార్థినులు (ఫైల్)

చిత్తూరు కలెక్టరేట్:జిల్లా వ్యాప్తంగా 8 కేజీబీవీ పాఠశాలలున్నాయి.ఈ పాఠశాలలు పేద, అనాథలతో పాటు బడి బయట ఉన్న బాలికలకు వరంగా మారాయి. ఉన్నత విద్యాప్రమాణాలు, ఆహ్లాదకర వాతావరణం.. ఇంగ్లిషు మీడియంలో బోధన.. ఇలా ఎన్నో సౌకర్యాలతో కార్పొరేట్ విద్యా సంస్థలను తలపించే ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు ఏటా పోటీ పెరుగుతోంది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్య, వసతి కల్పిస్తుండడంతో తమ పిల్లలను చేర్పేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి 6,7,8,9 తరగతులతోపాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇతర వివరాలకు 8978905307, 6301084843, 6281711838, 9573598070 నెంబర్లలో సంప్రదించాలని అధికారులు వెల్లడించారు.

పేద బాలికలకు వరం కేజీబీవీలు

చదవాలనే ఆసక్తి ఉన్నా పరిస్థితులు అనుకూలించక కొందరు.. ఆర్థిక స్తోమత లేక మరికొందరు.. తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలు.. ఇలా ఎంతో మంది పలు గ్రామాల్లో గతంలో బాలికలు చదువుకు దూరమయ్యేవారు. అలాంటి వారు చదువు కొనసాగించాలనే లక్ష్యంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు ప్రవేశపెట్టారు. నాడు 6 నుంచి 10వ తరగతి వరకు మాత్రమే చదువకునే అవకాశం ఉండగా.. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇంటర్ మీడియట్ వరకు వాటి స్థాయిని పెంచారు. అలాగే నాడు – నేడు మనబడి కార్యక్రమంలో భాగంగా సౌకర్యాలు మెరుగు పరచడంతో వాటిలో ప్రవేశాలకు మరింత పోటీ ఏర్పడింది.

ప్రాధాన్యతా క్రమంలో భర్తీ

సీట్ల భర్తీలో నిబంధనల మేరకు అనాథ, సింగిల్ పేరెంట్, బడి మధ్యలో మానేసిన, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీల వారీగా ప్రాధాన్యతా క్రమంలో సీట్లు కేటాయించనున్నారు. ప్రస్తుతం ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు సీట్లు భర్తీ చేస్తున్నారు. అందులో భాగంగా 6వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో మొత్తం సీట్లు భర్తీ చేస్తారు. 7, 8, 9 తరగతుల్లో ఖాళీల మేరకు అడ్మిషన్లు ఉంటాయి. ఇందుకోసం విద్యాశాఖ ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించింది. www.apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో విద్యార్థి పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్, కుల, ఆదాయ, రేషన్‌కార్డు నకలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఎంపికైన బాలికలకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది. సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చు.

సకల వసతులు

కేజీబీవీల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వాచ్‌మెన్‌లు, వంట మనుషులు ఇలా ప్రతి ఒక్కరూ మహిళలు మాత్రమే ఉంటారు. ఉభోజనం, వసతి, పౌష్టికాహారం, యూనిఫాం, షూ, దుప్పట్లు అందజేస్తారు. కరాటే శిక్షణతో పాటు ఇంగ్లిష్, గ్రూప్ డిస్కషన్స్, డ్యాన్స్, చిత్రలేఖనం, యోగా, స్వయం ఉపాధి కోర్సులు, కంప్యూటర్ విద్య, బాలికా సాధికారత క్లబ్‌ల ఏర్పాటు తదితర వాటిపై శిక్షణ, అవగాహన కల్పిస్తారు. తల్లిదండ్రులు లేని అనాథ బాలికలకు విద్యాలయంలోనే అన్ని వసతులు, సౌకర్యాలూ కల్పిస్తున్నారు. ప్రతి మూడు నెలలకోసారి 15 రకాల వస్తువులతో కూడిన హెల్త్ – హైజీన్ కిట్‌లు (ఆరోగ్య పరిశుభ్రత కిట్లు) అందజేస్తారు.

అవకాశాన్ని వినియోగించుకోవాలి



2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. ఈ అడ్మిషన్ల ప్రక్రియపై మండల స్థాయిలో, గ్రామస్థాయిలో సీఆర్‌పీలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్‌లు, కేజీబీవీ ఎస్‌వోలు, ఇతర విద్యాశాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలి. అనాథలు, బడిబయట పిల్లలు, బడి మానేసిన బాలికలను గుర్తించి వారిని అన్ని విధాలుగా తీర్చిదిద్దేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెల 20వ తేదీ లోపు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపడుతున్నాం.

– పి.వెంకటరమణారెడ్డి, ఏపీసీ, సమగ్రశిక్ష శాఖ, చిత్తూరు

ఏపీఎస్ఈఏ క్రికెట్ విజేతగా కేవీఎస్ కింగ్స్

గంగాధరనెల్లూరు: ఆంధ్రప్రదేశ్ సర్వేయర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీఎస్ఈఏ) క్రికెట్ టోర్నీ విజేతగా కేవీఎస్ కింగ్స్ నిలిచిందని జిల్లా సర్వేయర్ అసోసియేషన్ అధ్యక్షురాలు మంజుల తెలిపారు. మండలంలోని ఎట్టేరి వద్ద శనివారం తొమ్మిదో మైలు క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్‌ను జిల్లా సర్వేయర్ అధ్యక్షురాలు గిరిజ, ఉపాధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి గిరి ప్రారంభించారు. జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయని తెలిపారు. అనంతరం క్రికెట్ పోటీల్లో విజేతలుగా కేవీఎస్ కింగ్స్(కార్వేటినగరం, వెదురుకుప్పం సర్వేయర్స్ జట్టు) విజేతగా, పెనుమూరు సర్వేయర్ టీమ్ రన్నర్స్‌గా నిలిచిందన్నారు. బెస్ట్ బ్యాట్స్ మ్యాన్‌గా చరణ్‌తేజ, బెస్ట్ బౌలర్‌గా క్రిష్ణమూర్తి, మ్యాన్ ఆఫ్‌ది సీరిస్‌గా సాయికుమార్ నిలిచారన్నారు. విజేత జట్టు 11వ తేదీ సోమవారం సర్వేయర్స్ డేను పురస్కరించుకుని కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రంతోపాటు అవార్డును అందుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ అసోసియేషన్ ఈసీ మెంబర్స్ పాల్గొన్నారు.



విజేత జట్టు కేవీఎస్ కింగ్స్



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,600
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

కలెక్టర్‌కు డిప్యూటీ సీఎం సత్కారం



కలెక్టర్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు కలెక్టరేట్ : బదిలీపై నెల్లూరుకు వెళుతున్న కలెక్టర్ హరి నారాయణన్‌ను డిప్యూటీ సీఎం నారాయణస్వామి దుశ్శాలువతో సత్కరించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడంలో హరినారాయణన్ సేవలు ఎన్నటికీ మరువలేవమని చెప్పారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని శవం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక సిద్ధంపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని శవం పట్టాలపై పడిఉన్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. దాదాపు 40–45 ఏళ్ల మధ్య వయసు గల పురుషుడు రైలు కింద పడి చనిపోయినట్లు రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.